

బక్రీద్ పండగకు ఏర్పాట్లు చేయండి




బక్రీద్ పండుగ సందర్భంగా నమాజ్ ఏర్పాట్లు చేయాలని ముస్లిం నేతలు వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఈనెల ఏడో తేదీ శనివారం బక్రీద్ పండగ సందర్భంగా ఈద్గా మైదానంలో నమాజ్ చేసుకొనుటకు ఏర్పాట్లు చేయాలని తిరుపతి నగర కమిషనర్ మౌర్యకు, అడిషనల్ కమిషనర్‌కు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనావాసులుకు, ఈద్గా కమిటీ ప్రెసిడెంట్ ఎస్ఎండి రఫీ, వైస్ ప్రెసిడెంట్ హారున్ భాషా, కమిటీ సభ్యులు వినతి పత్రం ఇచ్చారు. వారు స్పందించి ఏర్పాట్లకు హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ వద్ద ఏర్పాట్లను రఫీ హిందుస్తానీ పరిశీలించారు.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్టు పనుల చిచ్చు

- రూ. 25 కోట్ల పనులు మాకే ఇవ్వండి
- చిత్తూరు కాంట్రాక్టర్లకు పనులు ఎలా ఇస్తారు..? : స్థానిక కాంట్రాక్టర్లు
- ఈ నెల 9న టెండర్ ఓపెన్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలో రావడంతో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్లు ఊపిరి పీల్చుకున్నారు. ఇక్కడ టిడిపికి చెందిన ఒక కాంట్రాక్టర్ టెండర్ పనులు అన్నీ తీసుకొని అందరికీ అప్ప చెప్పేవాడు. వాటికి సంబంధించిన ఏడు శాతం పర్సంటేజ్ తీసుకుని స్థానిక ఎమ్మెల్యేకి ఇస్తున్నట్లు సమాచారం. అయితే ఎమ్మెల్యే అనుచరులు ఇప్పుడు మొత్తం టెండర్ పనులు తమకే ఇవ్వాలని పట్టుపడుతున్నారు. దీంతో కూటమి పార్టీలో చిచ్చురేగుతుంది. గత వైసిపి ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు స్థానిక ఎమ్మెల్యేకు 10 శాతం డబ్బు ముట్టజెప్పి టెండర్ పనులు తీసుకునేవారు. టెండర్ పనులు చేసిన వైసిపి ప్రభుత్వం స్థానిక కార్పొరేటర్ కూడా ఎంతో కొంత ముట్ట చెప్పి పనులు తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే ఆ పనులు జరిగేవి కాదు. కాంట్రాక్ట్ పనులు చేసిన వారికి బిల్లులు మాత్రం ఏడాది తర్వాత వచ్చేవి. దీనివల్ల కాంట్రాక్టర్ పూర్తిగా నష్టపోయేవాడు, చాలామంది కాంట్రాక్టర్లు అప్పులపాలై పూరి వదిలి వెళ్ళిపోయారు.మరి కొందరు గత ప్రభుత్వంలో బిల్లులు రాక, చేసిన అప్పులు తీర్చలేక ఒత్తిడితో చనిపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చాలామంది కాంట్రాక్టర్లు అసోసియేషన్ ఏర్పాటు చేసుకొని టెండర్ పనులు దక్కించుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యేకి 7 శాతం వాటా ఇస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఏడాదిగి కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కాంట్రాక్టర్లు అందరికీ టెండర్ వర్కులు దక్కుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు ఎన్నికల్లో కోట్లాదిరూపాయలు ఖర్చు చేసి ఎన్నికల్లో గెలుపు పొందినట్లు కూటమి పార్టీ నేతలే గుసగుసలాడుతున్నారు. కానీ తిరుపతిలో ఖర్చు పెట్టినంత సంపాదించాలంటే అంత సులువుకాదు. సీఎం చంద్రబాబు నాయుడు అవినీతి అధికారులను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీ చేయడమే కాకుండా కొందరిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

కాంట్రాక్ట్ పనుల కోసం కూటమిలో చిచ్చు...

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మే నెల 15వ ఆర్థిక సంఘం నిధులతో సుమారు 16 కోట్ల రూపాయలు పనులు చేసేందుకు టెండర్లు పిలిచారు. మే 20వ తేదీ టెండర్లను తెరవాల్సి ఉంది. అయితే కొంతమంది టిడిపికి చెందిన కాంట్రాక్టర్లు తమకు మహానాడు కార్యక్రమం ఉందని టెండర్ ఓపెనింగ్ వాయిదా వేయాలని అధికారులను కోరారు. అందుకు అధికారులు ఎమ్మెల్యే అనుమతి తీసుకొని వాయిదా వేసినట్లు తెలిసింది. ఈనెల 9 తేదీ 15వ ఆర్థిక సంఘంలో16 కోట్ల రూపాయలతో రోడ్లు, కాలువలు, తాగునీటి పైపులైను, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, పారిశుద్ధ్యనికి సంబంధించిన పరికరాల కొనుగోలు సంబంధించి టెండర్లు పిలిచారు. దీంతోపాటు జనరల్ ఫండ్స్‌లో ఈనెల 10వ తేదీ సుమారు 10 కోట్ల రూపాయలకు టెండర్లు పిలిచారు. మొత్తం 25 కోట్ల రూపాయలు టెండర్ పనులను స్థానిక ఎమ్మెల్యే అన్న కుమారుడు తమకే వచ్చే విధంగా చక్రం తిప్పాడు. స్థానిక కాంట్రాక్టర్లు ఎవరికీ ఈ టెండర్లు ఇవ్వడం లేదని కాంట్రాక్టర్లకు సమాచారం తెలియడంతో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్ పనులు నమ్ముకుని జీవిస్తున్న వారు ఆందోళనకు గురవుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేకి 7 శాతం టెండర్ వరకు సంబంధించిన డబ్బులు ఇస్తున్నామని మొత్తం టెండర్ పనులు స్థానిక ఎమ్మెల్యే తీసుకుంటే తాము ఎలా బతకాలని ప్రశ్నిస్తున్నారు. 20 నుంచి 30 సంవత్సరాలుగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంటాక్ట్ పనులు చేసి జీవిస్తున్నామని, ఎమ్మెల్యే అనుచరులు టెండర్ వర్కులు తీసుకుంటే తమ ఒప్పుకోమని అంటున్నారు. 25 కోట్ల రూపాయలకు సంబంధించిన టెండర్ పనులు తాము చెప్పిన కాంట్రాక్టర్లకే ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే అన్న కుమారుడు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం.

టెండర్ వర్కులు చిత్తూరు కాంట్రాక్టర్లకే..


తిరుపతి ఎమ్మెల్యే అనుచరులు సుమారు 25 కోట్ల రూపాయలు టెండర్లు దక్కించుకొని చిత్తూరు సంబంధించిన కాంట్రాక్టర్లకు ఇస్తున్నట్లు కాంట్రాక్టర్ల మధ్య చర్చ జరుగుతుంది. టెండర్ వర్కులన్నీ చిత్తూరు సంబంధించిన వారికి ఇస్తే తిరుపతి కార్పొరేషన్ లో ఎన్నో సంవత్సరాల నుంచి పనులు చేస్తున్న కాంట్రాక్టర్లు ఏమైపోవాలని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరుపతి కార్పొరేషన్‌లో ప్రతి ఒక్క కాంట్రాక్టర్‌కి పనులు అసోసియేషన్ తరపున ఇస్తున్నారని ఇప్పుడు ఎమ్మెల్యే అన్నకుమారుడు చిత్తూరు వాళ్లకి ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక కాంట్రాక్టర్లకు టెండర్ పనులు ఇవ్వకపోతే మంత్రి నారా లోకేష్, సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని కాంట్రాక్టర్లు అంటున్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అన్ని విభాగాల్లో ఎమ్మెల్యే అన్న కుమారుడు ఆధిపత్యం చెలాయిస్తున్నారని అధికారులు ఇక్కడ పని చేయాలంటే భయపడుతున్నారని కాంట్రాక్టర్లు అంటున్నారు.

వైసిపి హయంలో అప్పుల పాలయ్యాం..

టిడిపికి అనుకూలంగా ఉన్న కొంతమంది కాంట్రాక్టర్లు వైసిపి హయంలో టెండర్ వర్కులు దక్కకపోవడంతో చాలామంది కాంట్రాక్టర్లు నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ పనులు తీసుకోవాలంటే అప్పట్లో 10 నుంచి 15 శాతం డబ్బులు ఇస్తేనే కాంట్రాక్ట్ వర్కులు ఇచ్చేవారని, పనులు చేసినప్పటికీ బిల్లులు ఇవ్వకుండా సంవత్సరాల తరబడి కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టారు. చేసిన పనులకు బిల్లులు రాక అప్పులు పాలు అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో కొంతవరకు పనులు చేస్తున్నప్పటికీ బిల్లులు వస్తున్నాయని, అయితే ఎమ్మెల్యే అనుచరులు టెండర్ పనులు అన్నీ తమకే ఇవ్వాలంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. వైసిపి ప్రభుత్వంలో కాంట్రాక్టర్లు తిరగబడితే వారిపై కేసులు పెట్టడమే కాకుండా జైలు కూడా పంపడం జరిగిందన్నారు. అలాంటి వారిని ఆదరించాల్సింది పోయి ఎమ్మెల్యే అనుచరులు తమకు నష్టం కలిగించే విధంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరిస్తున్నారు. ఈనెల తొమ్మిదో తేదీ జరిగే టెండర్ ఓపెనింగ్‌లో తమకు పనులు అప్పగించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. తమ ఊర్లో తమకు కాంట్రాక్టు పనులు ఇవ్వకుండా బయట ఊర్లో ఉన్నవారికి కాంట్రాక్ట్ పనులు ఇవ్వడమేమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం అధిష్టానం దృష్టికి తీసుకెళ్ళే విధంగా కాంట్రాక్టర్లు పథకం రూపొందిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పటిష్టమైన చర్యలు

- తిరుపతి జిల్లాలో 33 శాతం అడవుల పరిరక్షణ
- హరితాంధ్రప్రదేశ్ లక్ష్యాన్ని సాధిస్తాం : ప్రజాశక్తితో డిఎఫ్ఓ వివేక్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో తాను జిల్లా అటవీశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పూర్తిస్థాయిలో పర్యావరణ పరిరక్షణకు, అడవుల సంరక్షణకు, వన్యప్రాణుల మనుగడ ఇలా పలు అంశాలపై అధికారులతో చర్చించి సమన్వయంగా వ్యవహరిస్తున్నామని జిల్లా అటవీశాఖ అధికారి పళని వివేక్ ఆనంద్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి జిల్లా పరిధిలో అడవుల సంరక్షణకు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న పలు విషయాలను ప్రజాశక్తికి వివరించారు. తిరుపతి ఆధ్యాత్మిక క్షేత్రంలో నగర ప్రజలకు పచ్చదనంతో కూడిన ఆహ్లాదకర వాతావరణం అందిస్తున్న దివ్యారామంలో పచ్చదనం పెంపు కోసం అనేక జాతరకు సంబంధించిన మొక్కలను నాటి



సంరక్షణ చేస్తున్నామన్నారు. తిరుమల కాలినడక మార్గంలో చిరుత పులుల సంచారంతో భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తుగా తీసుకోవలసిన జాగ్రత్తలపై వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా గైడెన్స్ ప్రకారం టిటిడి అధికారులతో సమన్వయ సమావేశాలను ఇప్పటికే నిర్వహించామన్నారు. తిరుమల చుట్టుపక్కల మరింత పచ్చదనం పెంపు కోసం తిరుమల తిరుపతి దేవస్థానం ప్రభుత్వ అటవీ శాఖకు నిధులు మంజూరు చేయడానికి ముందుకు వచ్చిందన్నారు. దశలవారీగా టీటీడీ నుండి వచ్చే నిధులతో తిరుమల క్షేత్రం మరింత పచ్చదనాన్ని సంతరించుకునేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. తిరుమలలో మరింత పచ్చదనం పెంపు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలు మేరకు తాను ఒక మూడేళ్ల ప్రణాళికను వారం రోజుల్లో తయారు చేయడం జరిగిందన్నారు.

శేషాచలంలోనే అరుదైనదిగా..



శేషాచలం అడవులు అరుదైన వన్యప్రాణులతో పాటుగా, జీవ వైవిధ్యాన్ని కలిగి ఉన్నాయని, మానవాళి ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన మొక్కలు ఈ అడవులలో ఉన్నాయన్నారు. వాటి సంరక్షణకు కూడా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. శేషాచలంలో ఉండే సెలయేళ్లలో ఇటీవల అరుదైన చేపలను గుర్తించామన్నారు. ఈ రకమైన చేపలు దట్టమైన అడవులలోకి ఎలా వచ్చాయో వాటిని గుర్తించడానికి ముంబైలోని ఓ లేబరేటరీకి పంపనున్నట్లు తెలిపారు. మరోవైపు జిల్లాలో ఏనుగుల గుంపు వలన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, ఏనుగుల గుంపును దారి మళ్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని కర్ణాటక రాష్ట్రం నుండి కుంకి ఏనుగులను ఇప్పటికే తీసుకొచ్చామన్నారు. ఏనుగుల దాడుల నివారణకు ఆయా అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు అధికారులు ఇచ్చే సూచనలను తప్పకుండా పాటించాలని, ఏనుగులను భయపెట్టే పనులు చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

ఉన్నదాన్ని కాపాడుకోవడానికి..



తిరుపతి జిల్లా పరిధిలో ఉన్న అడవులను సంరక్షించుకోవడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమవంతుగా సహాయ సహకారాలు అందించాలన్నారు. అడవుల రక్షణ కేవలం అటవీశాఖ విభాగానికి మాత్రమే చెందినది కాదని, తిరుపతి జిల్లా వాసులకు అందరికీ అడవుల ప్రాముఖ్యతను వివరించేందుకు పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అడవులు సంరక్షింపబడితే మానవాళికి స్వచ్ఛమైన వాయువుతో పాటుగా జీవించడానికి సమృద్ధి వాతావరణం ఏర్పడుతుందన్నారు. సముద్ర తీరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఇటీవల గుర్తించడం జరిగిందని, అక్కడికి అరుదైన తాబేలు వచ్చిపోతుండడంతో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సంప్రదించి అక్కడి పరిస్థితిని వివరించడంతో కేవలం ఏడు రోజులలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ద్వారా ఆ ప్రాంతాన్ని అంతా కూడా సుందరంగా మార్చడం జరిగిందన్నారు. శేషాచలం అడవులు ఎంతో సుందరమైనవని, ఇక్కడ ప్రకృతిలో టూరిజం అభివృద్ధికి వివిధ ప్రణాళికలు సిద్ధం చేస్తూ, అందుకు తగిన మౌలిక సదుపాయాలను ఇప్పటికే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి కోసం నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

ఐదు లక్షల మొక్కలు నాటడానికి..

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాలతో హరితాంధ్రప్రదేశ్ థీమ్ గా తిరుపతి జిల్లాలో ఐదు లక్షల మొక్కలు నాటడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అన్ని విభాగాల సమన్వయంతో నాటిన 5 లక్షల మొక్కలను సంరక్షిస్తూ పచ్చదనం పెంపుకు శ్రీకారం చుట్టామన్నారు.

ఆ గదిలో ఏముంది..?

అర్జున్‌దాస్ గది(డోలు) తెరచిన దేవాదాయ శాఖ అధికారులు





సిబ్బందికి సూచనలు ఇస్తున్న మఠం ఏవో బాపిరెడ్డి



అర్జున్ దాస్ అధికారిక గది (డోలు)ను తెరచిన అధికారులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ స్వామి హాథీరాంజీ మఠం మాజీ మఠాధిపతి అర్జున్ దాస్ అధికారిక గది(డోలు)ను బుధవారం దేవాదాయ శాఖ అధికారులు మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డి, మఠాధిపతి ఓం ప్రకాష్ దాస్ సమక్షంలో తెరచి పంచనామా నిర్వహించారు. అర్జున్ దాస్ మఠాధిపతిగా కొనసాగుతూ మఠం నియమ నిబంధనలకు విరుద్ధంగా పలు అక్రమాలకు, మఠం భూముల అన్యాక్రాంతంలో పాలుపంచుకున్నారని ఆరోపణల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ అర్జున్ దాస్‌ను సస్పెండ్ చేస్తూ ఎంక్వయిరీకి ఆదేశించింది. ఎంక్వయిరీకి హాజరు కావాలని అనేకసార్లు అప్పటి మఠం ఫిట్ పర్సన్ రమేష్ నాయుడు లేఖలు రాసినా అర్జున్ దాస్ స్పందించకపోవడంతో 08.06.2023న అర్జున్ దాస్ అధికారిక గదిని అధికారులు సీజ్ చేయడం జరిగింది. ఆనాటి నుండి అర్జున్ దాస్ మళ్లీ మఠాధిపతిగా కొనసాగడానికి కోర్టుల ద్వారా తీవ్ర ప్రయత్నం చేశారు. కోర్టులు ఆయన మఠాధిపతిగా కొనసాగడానికి ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో మఠాధిపతిగా ఓం ప్రకాష్ దాస్‌ను ధార్మిక పరిషత్ నియమించింది. ఆయన మఠాధిపతిగా మఠం ఆధీనంలోని దేవాలయాలకు సంబంధించిన కార్యకలాపాలను చూసుకోవాలని ధార్మిక పరిషత్ సూచించింది. అర్జున్ దాస్ అధికారిక గది(డోలు)లో ఉన్న వస్తువులను, రికార్డులను దేవాదాయ శాఖ రెవెన్యూ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ కె.సత్యవతి, దేవాదాయ శాఖ ఆర్ జె సి కార్యాలయ తహశిల్దార్ వీఎన్ వీఆర్ కృష్ణ, మఠం సూపరింటెండెంట్ కేశవులు, సిబ్బంది సమక్షంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి రికార్డుల్లో పొందుపరచాలని మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డి సూచనలు చేశారు. గదిలో ఉన్న వస్తువులను పరిశీలనాత్మకంగా పరిగణించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మఠం లా ఆఫీసర్ కవిత, ల్యాండ్స్ క్లర్క్ సీతారామయ్య, మఠం సిబ్బంది మధు, విజయ నాయక్, విజయ్, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంలో విడాకుల ప్రస్తావన లేదు

సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : పవన్ కళ్యాణ్ మూడు పెళ్లిళ్లను గురుంచి గతంలో నేనెపుడు మాట్లాడలేదని, సనాతనధర్మాన్ని పవన్ కళ్యాణ్ నెత్తికెక్కుచుకున్నాకే, అరాచకమైన క్రూరమైన సనాతన ధర్మాన్ని పాటించేవారిని పవన్ కళ్యాణ్‌తో సహా సమర్ధించే ప్రతి ఒక్కరిని శిక్షించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని విమర్శించే వారిపై పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవాలంటున్నారు, కానీ ఆ ధర్మాన్ని సమర్ధించే వారిని శిక్షించాలన్నారు. సనాతన ధర్మంలో విడాకులు ఉంటాయా అని ప్రశ్నించానన్నారు. సనాతన ధర్మంలో విడాకులే లేనప్పుడు పవన్ కళ్యాణ్ విడాకులు ఎలా ఇచ్చారని ఆయన పునరుద్ఘాటించారు. సెక్యులరిజాన్ని నాశనం చేసే ఈ సనాతన ధర్మాన్ని పాటించేవారిని శిక్షించాలని, విమర్శించే వారిని కాదని నారాయణ తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మానవాళికి హానికరమైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించేందుకు అందరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పిలుపునిచ్చారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలు తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ , స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి నగరంలో 120 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్నటువంటి ప్లాస్టిక్, సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించామన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా గుడ్డ, జ్యూట్ బ్యాగులను, ఇతర రీసైక్లబుల్ ఐటమ్స్‌ని వాడుకునే విధంగా, ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యసాధనలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులందరూ పూర్తి స్థాయిలో పాల్గొనాలని కోరారు. ఈ ప్లాస్టిక్ బీట్ - ప్లాస్టిక్ పొల్యూషన్‌ని మూడు నెలల్లో తిరుపతిలో పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలో ఉన్న దుకాణదారులు, పెద్దపెద్ద మాల్స్ యజమానులు అందరూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, వివిధ సంస్థల వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి తుడా టవర్స్

తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నడిబొడ్డున నిర్మితమవుతున్న తుడా టవర్స్‌ను త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలియజేశారు. బుధవారం తుడా అధికారులతో కలిసి ఆయన తుడా టవర్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పక పాటించాలని సూచించారు. అదేవిధంగా నిబంధనలకు అనుగుణంగా నిర్మాణం జరగాలన్నారు. తుడా టవర్స్ రైల్వే స్టేషన్ బస్టాండుకు సమీపంలో ఉండడంతో డిమాండ్ అధికంగా ఉందని పేర్కొన్నారు. ఎక్కడా రాజీ పడకుండా టవర్స్ నిర్మాణం నిర్ణీత గడువులోపు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్, సూపర్డెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవీంద్ర, డిఈ భాష, ఏ ఈ షణ్ముగం, కేపిసి కాంట్రాక్టర్ సుశీల్ ఇతర ఇంజనీర్లు పాల్గొన్నారు.



తుడా టవర్స్ పనులు పరిశీలిస్తున్న చైర్మన్ డాక్టర్ దివాకర్ రెడ్డి

ఘనంగా రెడ్డివారి గురవారెడ్డి జన్మదిన వేడుకలు


జన్మదిన వేడుకల్లో అన్న దానం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -ఏర్పేడు : టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి జన్మదిన సందర్భంగా పాపానాయుడు పేటలో భారీ కేక్ ను ఏర్పాటు చేసి పలువురు మండల నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో శివశంకర్ రెడ్డి, నైనారు పొన్నారావు, అర్జున్ బాబు, కృష్ణవేణి, జాఫర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


రైతులకు ఆధునిక పరికరం అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం పిచ్చాటూరు మండలం మురిడియాపేటలో రాస్ కేవీకే ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని ప్రసంగించారు. రైతులకు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు నగదు, సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు ఇస్తోందని తెలిపారు. రాస్ కేవికే సంస్థ ఎప్పటికప్పుడు రైతులతో మమేకమై సాగు పద్ధతులలో సలహాలు, సూచనలు వారికి అందిస్తూ పూర్తి సహాయ సహకారాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పప్పు గింజ విత్తనాలను పంపిణీ చేశారు. రైతులకు పవర్ టిల్లర్ యంత్రాన్ని రైతులకు అందించారు. అనంతరం తులసికృష్ణ పురంలో మంచానికే పరిమితమయిన లక్ష్మీపతి కుమారుడు పి.సురేష్ ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, ఏఓ సంజీవ రెడ్డి, కెవికె శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, సుమంత్, అనూష, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వికాస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ కోర్సులు ప్రారంభం


కళాశాల చైర్మన్ పట్టుమాల సుధాకర్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని వికాస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ కోర్సు లో మొదటి, రెండవ సంవత్సరం తరగతులు జూన్ 5న ప్రారంభమవుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తూ పోటీ పరీక్షలకు సంసిద్ధులను చేసే విధంగా, కంప్యూటర్ శిక్షణ, ఈ ఏపీ సెట్ కోచింగ్ మొదలైన ఆధునిక శిక్షణ తరగతులు నిర్వహిస్తూ కళాశాల యాజమాన్యం తెలిపారు. అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన అధ్యాపకులతో పాఠ్యాంశాల బోధన ఉంటుందని కళాశాల చైర్మన్ పట్టుమాల సుధాకర్ తెలియపరిచారు. విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు ఈ కళాశాల ప్రారంభ వేడుకను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హేమచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ మనోహర్, రాము,నాగూర్ బాబు, చంద్రశేఖర్,రమణయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఇఎస్ఐ, పిఎఫ్‌లపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆర్‌వి కుమార్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో పనిచేస్తున్న ఎస్ఎల్ఎస్ ఎంపిసి కార్పొరేషన్ ఉద్యోగులకు ఇఎస్.ఐ, ఇపి.ఎఫ్ పై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. స్థానిక పద్మావతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్విమ్స్ సంచాలకులు డాక్టర్ ఆర్.వి. కుమార్, ఎంఎస్ డాక్టర్ రామ్, ఆర్ ఎంఓ డాక్టర్ కోటిరెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, రీజనల్ పి.ఎఫ్ కమీషనర్ బి. టి. సతీష్ కుమార్, స్విమ్స్ జిఎం రవీంద్రబాబు, తిరుపతి ఇఎస్ ఐసి అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, ఎంప్లాయిస్ జనరల్ సెక్రటరీ మురళీ, మెంబర్ ఫర్ రీజనల్ అడ్వైజర్ కమిటీ నేషనల్ బోర్డు ఫర్ వర్కర్స్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్మెంట్ లేబార్ రత్నకుమార్ విచ్చేసి, సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్విమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ ఇ.ఎస్.ఐ, ఇ.పి.ఎఫ్ లలో సభ్యులుగా చేరిన వారికి అనేక లాభాలు ఉన్నాయని, ఆ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ ఎస్ ఎల్ ఎస్ ఎంపీసీ, రాస్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మెహర్ కుటుంబానికి స్నేహితుల సాయం



ప్రజాశక్తి -శ్రీకాళహస్తి : ఇటీవల మృతి చెందిన మెహర్ కుటుంబానికి అతని స్నేహితులు రూ. 90 వేల ఆర్థిక సాయం అందించారు. ఆ మొత్తాన్ని మెహర్ తల్లికి అందజేసి అంత్యక్రియలకు ఉపయోగించాలని కోరారు. నా కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆర్థిక సాయం చేసి ఆదుకోండి: నిర్మల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దయగల దాతలు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని తిరుపతి నగర పరిధి సప్తగిరి నగర్ కు చెందిన బాధితురాలు నిర్మల వేడుకున్నారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తనకు భర్త లేరని, ఉన్న ఒక కొడుకును ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ పోషించుకుంటున్నానని తెలిపారు. అయితే తనకు గర్భసంచిలో మొదలైన ఆరోగ్య సమస్య క్రమేపి పెరిగిపోవడంతో ఇప్పటివరకు వివిధ ఆసుపత్రులను సంప్రదించి ఏడు ఆపరేషన్లు చేశారన్నారు. ప్రస్తుతం మళ్లీ ఇంకో శస్త్ర చికిత్స చేసుకుంటే గాని పూర్తిగా ఆరోగ్యంగా ఉండలేవని వైద్యులు సూచించారన్నారు. రుయా వైద్య సదుపాయాలు లేవని, ప్రైవేట్ హాస్పిటల్ లో ఈ శస్త్ర చికిత్స చేసుకోవాలని వైద్యులు సూచించారన్నారు. అయితే ఈ ఆపరేషన్ చేయించుకోవడానికి తనకు ఆర్థిక స్తోమత లేదని, దాతలు ఆదుకుంటే ఆరోగ్యవంతురాలిని అవుతానని చెప్పారు. 9177306011 తన ఫోన్ పే నెంబర్ అని వివరించారు. ఈ విలేకరుల సమావేశంలో నిర్మల కుమారుడు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం ర్యాలీలు X వార్షికోత్సవ సంబరాలు

వెన్నుపోటు అలవాటు చేసింది చంద్రబాబే : మాజీ ఎమ్మెల్యే కిలివేటి



ప్రజాశక్తి - నాయుడుపేట: రాష్ట్రంలో వెన్నుపోటు అలవాటు చేసింది చంద్రబాబు నాయుడని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా మాజీ సీఎం వైసీపీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి సూచనలతో రాష్ట్ర మొత్తం వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా, నాయుడుపేటలో వైసీపీ పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి వెన్నుపోటు అలవాటు చేసింది చంద్రబాబేనని, అబద్ధాలు మోసాలతో కూడిన పాలనను ప్రజలు అందిస్తు రాష్ట్రాన్ని దగా చేస్తున్నారని దుయ్యబట్టారు. వైస్రాయ్ హోటల్లో అప్పటి ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్ హామీల్లో పింఛన్ల పంపిణీ తప్ప ఏ ఒక్క హామీ నెరవేర్లేదని విమర్శించారు. ప్రజా వ్యతిరేక పాలనపై గళం ఎత్తిన ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డిని అక్రమ కేసుల్లో అరెస్టు చేశారన్నారు. తొలుత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు స్థానిక వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహిస్తూ నాయుడుపేట తాసిల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని తహసిల్దార్ ఎం.రాజేంద్రకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, వైసీపీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి, నాయుడుపేట మండలం వైసిపి అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, వైపీసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీని నమ్మి ప్రజలు మోసపోయారు : మేరిగ మురళి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న వెన్నుపోటు దినోత్సవంలో భాగంగా గూడూరు టవర్ క్లాక్ సెంటర్ నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వైసిపి ఎమ్మెల్సీ మేరిగ మురళి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరిగ మురళి మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని, అయితే సంవత్సరం అవుతున్న ఇప్పటివరకు ఏ పథకాలు అమలు చేయడం లేదని టిడిపి పార్టీని నమ్మి మోసపోయామని ప్రజలు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. కరోనా కష్టకాలంలో కూడా అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు మెట్టా రాధాకృష్ణ రెడ్డి, ఎంపీపీ గురవయ్య, భక్తవత్సల రెడ్డి, బాలకృష్ణారెడ్డి శ్రీనివాసులు,సునీల్ రెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. నట్టేట ముంచిన కూటమి : నూకతోటి రాజేష్



ప్రజాశక్తి -వరదయ్యపాలెం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏడాది కాలంలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని, వెన్నుపోటు అనేదానికి చంద్రబాబు పేటెంట్ అని సత్యవేడు వైఎస్సార్సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఎద్దేవా చేశారు. వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమంలో భాగంగా బుధవారం వైయస్సార్సీపి సమన్వయకర్త నూకతోటి రాజేష్ నేతృత్వంలో సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు వరదయ్యపాలెం తాసిల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి, రెవిన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం స్థానిక మీడియా ప్రతినిధులతో నూకతోటి రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల అప్పుడు బాబు ష్యూరిటీ–భవిష్యత్తు గ్యారెంటీ అన్నారు. కానీ, ఏడాది తిరిగేలోపే.. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ అనిపించుకున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో 7 మండలాలకు చెందిన మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు టీడీపీకి వెన్నతో పెట్టిన విద్య : మణినాయుడు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ వైఎస్ ఆర్ సి పి మండల కన్వీనర్ మణి నాయుడు అధ్వర్యంలో బుధవారం జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలు తీర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైదన్నారు.

ఓట్లేసిన ప్రజలకు వెన్నుపోట్లు : చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



ప్రజాశక్తి - రామచంద్రపురం: ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోట్లు పొడిచిందని చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ సమన్వకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పార్టీ శ్రేణులతో కలసి బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. క్లాక్టవర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ తహశీల్దారు కార్యాలయం వరకు సాగింది. వెన్నుపోటు దినం నిసనలో పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహిత్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది గడిచినా ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చకుండానే విజయోత్సవ సంబరాలు చేసుకోవడం చూస్తుంటే పవన్ కల్యాణ్ మాటలకు, చేతలకు పొంతనలేదన్నారు. ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే ప్రతిపక్ష వైఎస్ఆర్సీపీ నేతలపై దాడులు, దౌర్జన్యాలు, కేసులు అరెస్టులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రగిరి తహశీల్దారు శివరామసుబ్బయ్యకు వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో ఆరు మండలాల నుంచి వచ్చిన పార్టీ సీనియర్లు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల కమిటీ నేతలు, పంచాయతీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజా రంజక పాలనకు ఏడాది : ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : కూటమి ప్రభుత్వ ప్రజా రంజక పాలనకు ఏడాది పూర్తయిందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. 2024 జూన్ జగన్ బటన్ బద్దలైన రోజనీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాను పాలన చేపట్టిన శుభ దినమని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ భవన్ లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని కొనియాడారు. జగన్ అతిపెద్ద వెన్నుపోటుదారుడని విమర్శించారు. ఆయనకు చంద్రబాబుపై మాట్లాడే హక్కు లేదని స్పష్టం చేశారు. పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడిన రాష్ట్ర ప్రజలు : ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజాశక్తి - రామచంద్రాపురం: కూటమి ప్రభుత్వం పాలన ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రగిరి పట్టణం టవర్ క్లాక్ వద్ద బుధవారం విజయోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. భారీ కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ వైసీపీ అరాచకాలకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడారన్నారు. అందరూ కలిసికట్టుగా 30 సంవత్సరాలు తర్వాత చంద్రగిరి కోట మీద తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేశామన్నారు. ఈ వేడుకలలో నాయకులు, కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం హాస్యాస్పదం : గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర భయాందోళనలో జీవనం సాగించారని, వైసిపి నాయకులు వెన్నుపోటు దినం నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఎద్దేవా చేశారు. గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రజల ఆదరణ చూసి భయపడి వైసిపి నాయకులు వెన్నుపోటు దినం కార్యక్రమం చేశారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వంలో మెగాడీఎస్సీ వేస్తామని హామీ ఇచ్చారు ఏమి చేశారో గుర్తు చేసుకోవాలని కోరారు. పేదవాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను మూసివేసారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను నుండి ఒక్కరికైనా ఏ సహాయమైనా జరిగిందా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన మొదటి నెలలోనే పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచామని, ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. వైసిపి నాయకులు ఎన్ని అసత్య ఆరోపణలు చేసినా ప్రజలు నమ్మరన్నారు. ఈ సమావేశంలో నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, ఇజ్రాయిల్ కుమార్, రవీందర్ రెడ్డి, శ్రీనివాసులు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి కోటపై టీడీపీ జెండా ఎగరడం సంతోషం : టీడీపీ నాయకులు




ప్రజాశక్తి - యర్రావారిపాలెం: కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిన సందర్భంగా మండలంలోని కూటమి నాయకులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు బుధవారం ఘనంగా బాణా సంచా పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం మండలంలో చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకుంటూ జేజేలు పలికారు. 30 సంవత్సరాల తర్వాత చంద్రగిరి కోట పైన టిడిపి జెండా ఎగరవేయడం సంతోషంగా ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దేశిరెడ్డి రఘు నాథ, కార్యదర్శి మహేష్ నాయుడు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ మధు, తలకోన చైర్మన్ సోమనాథ్ రెడ్డి, నిరంజన్, జనసేన మురళి, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పీడ విరగడై సరిగ్గా ఏడాది : మండల కూటమి నాయకులు



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడి, టీడీపీని అధికారంలోకి తెచ్చుకొని రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని కూటమి నాయకులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. సంక్షేమం, అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న కూటమి ప్రభుత్వ సుపరిపాలనను అభినందిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు బాణా సంచాలు పేల్చి, దీపాలు వెలిగించి, కొవ్వొత్తులు ప్లకార్డులు చేతబట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముని చంద్ర నాయుడు, రవినాయుడు, కార్తీక్ నాయుడు, రామనాథం, మనోహర్ ఇంకా పెద్ద ఎత్తున కూటమి అభిమానులు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు..

తుడా చైర్మన్‌ను కలిసిన క్రెడాయ్ ప్రతినిధులు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిని మంగళవారం తుడా కార్యాలయంలో క్రెడాయ్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. క్రెడాయ్ సభ్యులైన డాలర్స్ దివాకర్ రెడ్డి తుడా చైర్మన్‌గా నియమితులవడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి నగరం నెక్స్ట్ లెవెల్ కి వెళుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తిరుపతి నగర అభివృద్ధిలో తుడాతో కలిసి క్రెడాయ్ కూడా పనిచేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ తిరుపతి చాప్టర్ చైర్మన్ గోపీనాథ్, అధ్యక్షులు రాంప్రసాదరావు, ఉపాధ్యక్షులు రాజేష్, కార్యదర్శి నరసింహారెడ్డి, ట్రెజరర్ హరికృష్ణ, సభ్యులు స్వరూప్, ప్రభాకర్, నీలేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయండి: బి.యన్.రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గడిచిన 24 సంవత్సరాలుగా సందేశాత్మక సాంఘిక నాటకాలతో ప్రజల ఆదరాభిమానాలను చురగొనుతున్న అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్స్ రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బి.ఎన్.రెడ్డి కోరారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభినయ ఆర్ట్స్ హనుమ అవార్డ్స్ 25వ వార్షికోత్సవాన్ని జూలై 19 నుండి 27వ తేదీ వరకు 9 రోజులపాటు మహతి కళాక్షేత్రం వేదికగా నిర్వహింపబడుతాయన్నారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్, దాతల సహకారంతో ఇన్నేళ్లుగా నిర్విరామంగా మరుగున పడిపోతున్న పౌరాణిక పద్య నాటకాలను, సందేశాత్మక సాంఘిక నాటికలను ప్రదర్శింపబడుతూ ప్రజల మన్ననలు అందుకుంటున్నామన్నారు. ఈ ఏడు 25వ వార్షికోత్సవం సందర్భంగా మహతి కళాక్షేత్రంలో 32 పద్య నాటకములు, 53 సాంఘిక నాటకాలు కు దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ప్రాథమిక పరిశీలనలో ఉత్తమమైన పద్య నాటకములు, 8 సాంఘిక నాటికలను ఎంపిక చేసామన్నారు. నాటకములు, నాటికలే కాకుండా ప్రతిరోజు ఉదయం కూచిపూడి, భరతనాట్యం, జానపద బృందాల నృత్య పోటీలతో పాటు సోలో నృత్యాలు. నృత్య పోటీలలో పాల్గొనదలచిన వారు 9581154667 ను సంప్రదించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో అభినయ ఆర్ట్స్ గౌరవ అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, అధ్యక్షులు సూర్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు అంకమ నాయుడు, శోభ, ఇరముని శేఖర్, నాగిశెట్టి బాలాజీ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

బస్సును ఢీకొన్న స్కూటర్.. ముగ్గురికి గాయాలు


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని శ్రీకాళహస్తి – తడ రోడ్డు విజయగోపాలపురం దగ్గర స్కూటర్ అదుపు తప్పి బస్సును ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు కాటూరు గ్రామానికి చెందిన ఆకాష్, విష్ణు, చందు అను ముగ్గురు బుధవారం బియస్ కండ్రిగ నుంచి కాటూరుకు స్కూటర్లో పోతుండగా, విజయగోపాలపరం గ్రామం వద్ద రోడ్డు ప్రక్కన పైపులైను పనులు జరుగుతున్నాయి. సగం రోడ్డులో జేసీబీ, క్రేన్ ఉండటంతో ఎదరుగా వస్తున్న బస్సును గుర్తించకుండ పోవడంతో స్కూటర్ బస్సును ఢీ కొనింది. గాయపడిన వారిని శ్రీకాళహస్తి ఏరియా అసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్యకర జీవితానికి యోగా


చంగ్రిరి కోట ఆవరణలో యోగ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రామచంద్రపురం: మనిషి ఆరోగ్యకర జీవితానికి యోగాసనాలు అత్యుత్తమ సాధనమని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. చంద్రగిరి కోటలో బుధవారం యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాని, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ఆర్డిఓ రామ్మోహన్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ అధ్యక్షులు నరసింహ యాదవ్, తుడా అధ్యక్షులు దివాకర్ రెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి తాసిల్దార్ శివరామసుబ్బయ్య ఇన్చార్జ్ ఎంపీడీవో వెంకటరత్నం నాయుడు పలువురు ఇతర శాఖల అధికారులు, సిడిసియం చైర్మన్ పల్లిలేని సుబ్రమణ్యం నాయుడు, మార్కెటింగ్ యార్డ్ చైర్మన్ గౌస్ బాషా, మండల టిడిపి అధ్యక్షులు, మండల మహిళా పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సునీత సింగు సుధా, బీసీ సెల్, ఎస్సీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కైలాసధామం నిర్మాణానికి విరాళం



ప్రజాశక్తి - రామచంద్రాపురం: చంద్రగిరిలో స్వర్ణముఖి నది ఒడ్డున నిర్మిస్తున్న కైలాస ధామానికి, ఆర్ జె వెంచర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ దామరపాటి రాకేష్ 1,16,000/ రూపాయలను విరాళంగా ప్రకటించి చెక్కను ఎమ్మెల్యే నానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చినాయుడు పల్లి సర్పంచ్ రవి నాయుడు, మాజీ సర్పంచ్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్: టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైదని కులసచివులు డాక్టర్ భాస్కరుడు వెల్లడించారు. వేద విభాగంలో వివిధ శాఖలకు, భాష్యాలకు కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఈనెల 10వ తేదీ లోపల ధరఖాస్తును వేదిక్ యూనివర్సిటీ అడ్రస్‌కు పంపాలని తెలిపారు. ఆగమ పౌరోహిత్యం విభాగాలలో అభిజ్ఞ కోర్సులకు కూడా అడ్మిషన్లు నిర్వహించబడుతుదన్నారు.

ప్రవేశ పరీక్ష వాయిదా వేయండి

ప్రజాశక్తి - క్యాంపస్ : జూన్ 6 నుంచి జూలై 6వ తేదీ వరకు డిఎస్సి పరీక్షలు నిర్వహిస్తున్నారని, ఆయా తేదీలలో ఉన్నటువంటి ఎపి పిజి సెట్ పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్వీయులో పీజీ సెట్ కన్వీనర్ పీసీ వెంకటేశ్వర్లును కలిసి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సంద్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి , జిల్లా అధ్యక్షులు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నూతనగం విడుదల చేసిన డీఎస్సీ షెడ్యూల్ వల్ల పీజీ ఎంట్రెన్స్ రాసే విద్యార్థులకి ఇబ్బందిగా ఉందని డీఎస్సీ, పీజీ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలు చాలా సబ్జెక్ట్ ఒకే రోజు వుండటం వలన, డీఎస్సీ పరీక్ష వున్న రోజు పీజీ కామన్ ఎంట్రెన్స్ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కన్వీనర్ ప్రో వెంకటేశ్వర్లు ఈ అంశం గురించి ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మన్‌తో, సెట్ చైర్మన్‌తో చర్చిస్తున్నామని, విద్యార్థులకి ఎటువంటి ఇబంది లేకుండా పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారన్నారు. ఈ కార్ర్యమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఓం రాజ్, విష్ణు, గ్రేస్ పాల్గొన్నారు.

టీడీపీలో ఉండే స్వేచ్ఛ వైసీపీలో లేదు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తెలుగుదేశం పార్టీలో ఉండే స్వేచ్ఛ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో లేదని, కొన్ని అవమానాలను తట్టుకోలేక వ్యక్తిగతంగా వైసిపి నుండి తాను బయటకు వచ్చానని, ఎవరో స్క్రిప్టులు రాసిస్తే వాటిని చదివి వైసిపి నాయకులు తమ విలువలు పోగొట్టుకోవద్దని పద్మావతిపురం మాజీ సర్పంచి గణపతి నాయుడు సూచించారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన విషయంపై తాను వ్యక్తిగతంగా వచ్చి అందుకు తన అంగీకారాన్ని, సమాధానాన్ని మీడియాకు వివరించాలన్నారు. అయితే తనపై ఉద్దేశపూర్వకంగా అక్రమంగా సెటిల్మెంట్లు, భూకబ్జాలు చేశానని ఎవరో రాసిన స్క్రిప్టులు చదివి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వాస్తవంగా వారు చెప్పిన విధంగా నేను అలా చేసి కోట్లు వెనకేసి ఉంటే 95 శాతం ఆరోపించిన వ్యక్తులు తీసుకొని, తనకు ఐదు శాతం ఇవ్వాలని బహిరంగంగా సవాల్ విసిరారు. ఈ విలేకరుల సమావేశంలో చిగురువాడ సర్పంచి ప్రదీప్ రెడ్డి, కూరకాల్వ సుధాకర్, రాజేంద్ర, సునీల్ చౌదరి, శ్రీనివాసులు, గోపాల్, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో నాగు పాము



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మండలం, పిల్లార పట్టు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నాగు పాము తిరుగుతుండటంతో కళాశాలలో పనిచేస్తున్న సిబ్బంది, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కళాశాల ప్రిన్సిపల్ స్నేక్ క్యాచర్ శ్రీకాంత్‌కి సమాచారం ఇవ్వగా, శ్రీకాంత్ అక్కడికి చేరుకుని పామును పట్టుకొని దూరంగా అడవి ప్రాంతంలో విడిచి పెట్టారు. సిబ్బంది, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

ఏడాది పాలనపై జనసేన సంబరాలు

ప్రజాశక్తి - నాయుడుపేట: రాక్షస పరిపాలనను అంతమొందించి, ఎన్డీఏ కూటమిని ప్రజల ఆశీర్వదించి ఏడాది గడిచిన సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో బుధవారం నాయుడుపేట పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద మహిళలకు ముగ్గులు పోటీ నిర్వహించి గెలుపొందిన మహిళలకు సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్ బహుమతులు అందజేశారు. అనంతరం బాణాసంచా కాల్చి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందుతున్నారని తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలిచిన నాటి నుండి



ఆమె నిత్యం ప్రజల్లో ఉంటూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, నియోజకవర్గ సమస్యలను పరిష్కరిస్తూ మంచి పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని పాతవీరాపురం గ్రామంలో శ్రీ ద్రౌపతి సమేత శ్రీ ధర్మరాజుల స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి స్వామి అమ్మవార్ల ప్రతిమలను అలంకరించి కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

ఆలయ శిఖర ప్రతిష్టకు విరాళం



ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానం ఆలయ శిఖర ప్రతిష్ట కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మేకలత్తూరు లలితా కరుణాకర్, శ్రీనివాస్ జువెలర్స్ ప్రోపరేటర్ మేకలత్తూర్ కరుణాకర్ దంపతులు రూ.55000 విరాళం అందజేశారు. వీరికి ఆలయ అధికారులు, తగ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బ్రహ్మోత్సవానికి రండి.. ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవానికి నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్, డిప్యూటీ ఈవో హరినాథ్, అప్పలాయగుంట టెంపుల్ ఇన్స్పెక్టర్ సుకుమార్, ఆలయ బృందం కలిసి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక అందజేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ, వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని, సూచించారు

అనుపల్లెలో వైభవంగా గంగ జాతర







ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని అనుపల్లె గ్రామంలో గంగ జాతర వైభవంగా జరిగింది. బుధవారం ఉదయం వేకువజామున గంగమ్మ అమ్మవారి ఊరేగింపు జరిగింది. అనుపల్లి గ్రామంలో 25 సంవత్సరాల తర్వాత గంగ జాతరను నిర్వహించారు. మంగళవారం రాత్రి చల్లకుండా, దున్నపోతును ఊరేగింపు చేశారు. అనంతరం బంక మట్టితో గంగమ్మ తల్లి ప్రతిమను ప్రతిష్ట చేశారు. బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు గంగమ్మ విగ్రహా నిమజ్జనం నిర్వహించారు. ఈ జాతర సందర్భంలో సాము కత్తులకు ఎలాంటి ఆధారం లేకుండా నేసనూరు చింపిరయ్య, తన మంత్ర ప్రభావాలతో 15 అడుగుల ఎత్తులో రెండు రాగల రాయిలు, రెండు కుండలను వేలాడదీసే తీయడం ఆనవాయితీ, తర్వాత నేసనూరు పిచ్చయ్య, గురవయ్యలు చేసేవారు. వారి మరణాంతరం బుధవారం నిర్వహించిన గంగ జాతరల్లో తన పూర్వీకుల నుండి నేర్చుకున్న మంత్ర శక్తితో రాంపూరి దొరస్వామి రెండు మట్టి కుండలు, రాగల రాయిని మంగళవారం రాత్రి వేలాడ తీశారు. ఇది గంగ జాతరలో ప్రత్యేకతను చాటుకుంది. అందరినీ ఆకట్టుకుంది. భక్తులు గంగమ్మకు పలువురు పట్టు వస్త్రాలు సమర్పించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆనంబట్టు గంగమ్మ జాతరలో మాజీ మంత్రి రోజా



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం తొర్రూరు పంచాయతీ ఆనంబట్టు గ్రామంలో వైభవంగా జరుగుతున్న గంగమ్మ జాతరలో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆలయ నిర్వహకులు, వైసీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షులు అన్నా లోకనాథం, ఎంపీపీ మునివేలమ్మ, నేసనూర్ సర్పంచ్ గోవింద స్వామి రెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, ఆలయ మాజీ చైర్మన్ మనోహర్ రెడ్డి, మండలం వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులు స్థానిక గ్రామస్తులు, మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ముత్యపు పందిరి వాహనంపై గోవిందుని అభయం



ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన బుధవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామివారు ముత్యపుపందిరి వాహనంపై భక్తులను కటాక్షించారు. బుధవారం రాత్రి 7 గంటలకు స్వామివారి వాహన సేవ ప్రారంభమైంది.

ముత్యపు పందిరి సకల సౌభాగ్య సిద్ధి



నిత్య అలంకార ప్రియుడైన శ్రీవారు పూటకొక అలంకారంలో దేదీప్యమానంగా వెలిగిపోతుంటారు. మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించే ముత్యపుపందిరిపై భక్తులను చల్లగా ఆశీర్వదిస్తారు. జ్యోతిషశాస్త్రం ముత్యాన్ని చంద్రునికి ప్రతీకగా చెబుతోంది. సముద్రం మనకు ప్రసాదించిన మేలివస్తువులలో ముత్యం ఒకటి. చల్లని ముత్యాల కింద నిలిచిన స్వామివారి దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూరుస్తుంది.



వాహనసేవలో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, ఎఫ్ ఏ అండ్ సిఏవో ఓ బాలాజీ, డిప్యూటీ ఈవో వి.ఆర్.శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ఏవీఎస్వో మోహన్ రెడ్డి, పలువురు అధికారులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

